కలలో కనిపించి
ఊరికి దారి చూపిన
ఆమె ఎవరు?

# కలలాంటి నిజం

టి.రాఘవేంద్రరావు
కథ

ఇలా కలరావడం రెండోసారి.

దట్టమైన చీకటి. రిజర్వు చెట్ల అడవి. ఇసుకనేల... నడవడం కష్టం. నేలలో కూరుకుపోయాడు. చిన్న వంకలోంచి నీళ్ళు, తనను నీళ్లలోకి లాగుతున్నట్టు లేచి కూచున్నాడు కల అయినా భయంకరమైన కల.

కానీ చిత్రమేమిటంటే ఇలాంటి కల వచ్చి ఆర్నెల్లయింది. ఇప్పుడిది రెండో సారి. ఆసారికూడా తన శ్రీమతి ఊళ్లో లేదు.

ఇప్పుడుకూడా అంతే. కలలోంచి తేరుకునే సరికి సాయంత్రం నాలుగైంది. గబగబా లేచి తయారయ్యాడు. బయటకు వెళ్లి చూశాడు. చల్లటి గాలి వీస్తోంది. ఆకాశం నిర్మలంగా వుంది. బట్టలు వేసుకుని హోటల్‌కు దారితీశాడు. టిఫిన్ ముగించి కాఫీ తాగాడు. క్లబ్‌కు వెళ్లాడు. మిత్రులందరు పేకాటలో వున్నారు. గంటసేపు కూచున్నాడు. వుండబుద్ధికాలేదు. బయటకు వచ్చాడు

మెరుపులా ఓ ఆలోచన పుట్టింది. జేబులోంచి పర్సు తీశాడు. చాలినంత డబ్బు వుంది. శ్రీమతి పుట్టింట్లో వుంది. రైలుకు వెళ్తే అత్తారి ఊరు రెండు గంటల ప్రయాణం. ఏడు, ఏడున్నరకు వాళ్ల ఊరు చేరవచ్చు. స్టేషన్‌కు బయలుదేరాడు. చల్లగాలి చురుగ్గా వుంది. ఎక్కడో వానకురిసిందేమో స్టేషన్ చేరాడు. ఐదు నిమిషాల్లో రైలు వచ్చింది. టికెట్ తీసుకుని రైల్లో కూచున్నాడు. రైలు బయలుదేరింది. రానురాను చలిగాలి హెచ్చింది. మఫ్లర్ మాత్రమే మెడచుట్టూ వుంది. సర్దుకున్నాడు. కిటికీలోంచి చూశాడు. అప్పటికి ప్రయాణం గంటమాత్రమే ముగిసింది. చీకటి పడుతోంది. మొహంమీద రెండు



చినుకులు పడ్డాయ్. తుడుచుకున్నాడు. తను దిగాల్సిన స్టేషన్‌లో రైలు ఆగింది. దిగి ప్లాట్‌ఫారంలోకి అడుగుపెట్టాడు. విపరీతమైన చలిగాలి వీస్తోంది. స్టేషన్ దాటి బయటకు వచ్చాడు. రైలు కూత వినిపించింది. రైలు బయల్దేరిన శబ్దం. మసక వెన్నెల పడుతోంది. మూడు కిలోమీటర్లు నడిస్తేగాని ఊరు చేరడు. నడక ప్రారంభించాడు.

రెండు చినుకులు మొహంమీద పడ్డాయ్. ఆకాశంవేపు చూశాడు. మబ్బులు నల్లగా విస్తరిస్తున్నాయ్. అప్పటికి అర కిలోమీటర్ నడిచాడేమో వెనక్కు తిరిగి వెళ్లిపోదామా అనుకున్నాడు. కానీ శ్రీమతికి హఠాత్తుగా వాళ్ల ఊళ్లో కనిపించి ఉత్కంఠతను, ఆశ్చర్యాన్ని కలిగించాలనుకున్నాడు. ఆ సన్నివేశం తలచుకుని నవ్వుకున్నాడు. వర్షం హెచ్చింది. పొరపాటు చేశానా అన్న భావన కలిగింది. కానీ శ్రీమతికి కలిగే ఉత్కంఠం, ఆశ్చర్యం తన ఇబ్బందికి, శ్రమకు కలిగే మహత్తరమైన ఫలం. మసక వెన్నెల, నీడ, చీకటి, రిజర్వు చెట్లు. ఎక్కువవుతున్న వర్షం. హఠాత్తుగా గొప్ప మెరుపు, ఉరిమిన శబ్దం.

రోడ్డుకు అడ్డంగా కాలువ పోతోంది. కాలువమీద చిన్న బ్రిడ్జి. రెండువైపులా అరుగులున్నట్లు దూరంగా కనిపించింది. కానీ ఆ మెరుపు కాంతిలోంచి బ్రిడ్జి కట్టమీద ఓ మనిషి కూచున్నట్లు లీలగా కనిపించింది. ఓ మనిషి తోడు దొరుకుతుందన్న ఆశతో ముందుకు సాగాడు. దగ్గరగా వచ్చి చూశాడు. ఓ ఆడమనిషి మరోసారి మెరుపు. ఆ కాంతిలో చూశాడు. వయస్సులో వున్న అమ్మాయి మొహం తెల్లగా మెరిసిపోతోంది. దగ్గరగా వచ్చాడు. వెన్నెల కాస్త హెచ్చింది. ఆ వెన్నెల్లో స్పష్టంగా చూశాడు. వెళ్లి దూరంగా కూచున్నాడు.

''వర్షం ఎక్కువయ్యేలా వుంది'' అన్నాడు.

ఆ మనిషి మొహం తీవ్రంగా అతనివేపు చూసింది.

''సరిగ్గా దారితెలియదు. స్టేషన్‌కు వెనక్కు వెళ్లి పోవాలనుంది'' అన్నాడు మళ్లీ.

బిగ్గరగా నవ్వింది ఆ మనిషి. అదిరిపడ్డాడు. అట్లా నవ్వడం అసహజంగానూ, అతిశయంగానూ కనిపించింది. అందులోనూ వయస్సులో వున్న అమ్మాయి.

''ఏమిటి నవ్వుతున్నారు'' అన్నాడు.

''ఈమాత్రానికే వెనక్కువెళ్లిపోతారా''

''దారి సరిగ్గా తెలియదు. వర్షం ఎక్కువయ్యేలా వుంది'' అంటూ ఆమెవైపు చూశాడు.

స్పష్టమైన వెన్నెల్లో ఆమె కళ్లు మెరుస్తున్నాయ్. ఆ మెరుపు సామాన్యంగా తను చూసిన అమ్మాయిల కళ్లలోని మెరుపులా లేదు.

వింతగా, కాంతివంతంగా కనిపించింది.

ఒంటరిగా ఇక్కడ ఎందుకుందో.

''మీరు'' అన్నాడు.

''నాపేరు రజని. పక్కన పట్నంలో కాలేజీలో చదువుతున్నాను. రైలు దిగి వస్తున్నాను. రేపటినుంచి వారం రోజులు సెలవులు. వర్షం తగ్గుతుందేమోనని ఇక్కడ కూచున్నాను. నందవరం వెళ్లాలి. అది మా వూరే''

తదేకంగా ఆమెవైపు అప్పుడు చూశాడు. చినుకులు పడ్తున్నాయ్. కానీ ఆమె బట్టలు తడిసినట్టు లేదు. పొడిగానే వున్నాయ్. కానీ పిండినట్లు వున్నాయ్. తన బట్టలు సగానికి పైగా తడిసిపోయినయ్. బట్టలు పిండుకుని కూచున్నదేమో అని సమాధానపడ్డాడు.

వర్షం జోరు అందుకుంది.

''వెనక్కు వెళ్తానండి'' అన్నాడు.

''అబ్బే ఎందుకూ. నేనూ వెళ్లాలి. మీరు

అక్కడికేగా. దారి నాకు బాగా తెలుసు. కొన్ని వందలసార్లు ఈ దార్లో తిరిగాను. మీరేమీ కంగారుపడకండి. త్వరత్వరగా నడిస్తే ఎంతసేపు అరగంటలో వెళ్లిపోతాం. మీరూ నాకు తోడుగా వున్నారుగా బయల్దేరండి'' అని లేచి నుంచుంది. నల్లని జుట్టు మెడమీదనుంచి భుజాలమీద పడ్డది. రాజు లేచి నిలబడ్డాడు. వర్షపు చినుకులు ఘాటుగా మొహంమీద పడుతున్నాయ్.

''ముందు నేను నడుస్తాను. వెనకాల నడవండి'' అంది ఆ అమ్మాయి.

రాజు అనుసరించాడు.

వెన్నెల్లో అమ్మాయి వెనక నడవడం వింత అనుభవం.

ఇంత ధైర్యంగా ఒంటరిగా ఎలా వచ్చిందో. ఎంత తన ఊరైనా చీకటి, వర్షం, ఇవన్నీ చూసుకోకుండా. తనయితే ఓ విచిత్రమైన సన్నివేశంలో ఇరుక్కున్నాడు. కానీ ఆమెకీ తొందరపాటు ప్రయాణం ఎందుకు.

సాయంత్రం ఆకాశం నిర్మలంగానే వుంది. వర్షం రాదనుకుని బయల్దేరిందేమో.

దారి సాగుతోంది.

ఆమె వెనకాలే నడుస్తున్నాడు.

ఇంత అందమైన మనుషులుంటారా భూమ్మీద. రాజు ఆలోచిస్తున్నాడు.

కానీ ఆమె వివరాలు తను ఇంతవరకు తెలుసుకోలేదు. ఆ విచిత్ర భయంకర స్వాప్నిక వాతావరణంలో ఇల్లు చేరాలన్న తొందర తన ఆలోచనల్ని తొక్కేసింది.

ఇంతలో ఆమె **''వందవరంలో మీరు ఎవరింటికి వెళ్లాలి''**

అప్పుడు గుర్తుకొచ్చింది రాజుకు.

ఆమె కంఠధ్వని గుసగుసలతోకూడిన సన్నని ఫిడేలు ధ్వనిలా వుంది.

''సీతారామయ్యగారింటికి'' అన్నాడు.


''వారు మీకు ఏమవుతారు''

''మామగారు''

''మీరు సుజన శ్రీవారా''

''అవును. మీకు సుజన తెలుసా''

''ఎందుకుతెలీదూ. బాల్యస్నేహితులం.



మిమ్మల్ని కలుసుకోవడం ఎంత ఆనందంగా వుందోతెలుసా'' అంటూ దగ్గరగావచ్చింది.

హఠాత్తుగా ఆమెనుంచి అద్భుతమైన, అసాధారణమైన సుగంధం ఏదో వీచింది. ఆధునిక పాప్ గీతాలు పాడే గాయనిలా కనిపించింది.

ఆమె నడక మరీ లయబద్ధంగా సాగింది. ఇదివరకులేని వయ్యారం, సొగసు, సోయగం ఆమె ప్రకటిస్తున్నట్లు రాజుకు అనుమానం వేసింది.

ముందుకు సాగుతున్నారు.

రాజులో కలవరం.

రజని వర్తనలో మార్పు కనిపించింది. తనకు దగ్గరగా రావడానికి ఆ అమ్మాయి ప్రవర్తిస్తున్నట్లు అనుమానంవేసింది రాజుకు. రెండుమూడుసార్లు నడకలో వేగం తగ్గించి రాజుకు రాసుకు తిరిగింది.

ఆ స్పర్శ విచిత్రంగా వుంది.

విద్యుత్తు ప్రసరించినట్లే వుంది.

అతని శరీరం కాస్త వణికింది.

ఇది అపురూపమైన స్పర్శ. రాజు స్త్రీ స్పర్శ ఎరుగనివాడుకాదు. ఇది వింతగా వుంది. ఆలోచనలో పడ్డ రాజు నడక వేగం తగ్గింది. ఆ అమ్మాయికి, అతనికి దూరం హెచ్చింది.

''నడవండి'' అని హెచ్చరించింది అమ్మాయి. రాజు వేగం పెంచాడు.

ఆమెను కలుసుకున్నాడు.

ముందు చిన్న వాగు.

''దీన్ని ఇసుకవంక అని అంటాము'' అంది. వాగులో నీళ్లు జోరుగా, హోరుగా ప్రవహిస్తున్నాయ్.

''నేను నీళ్లలో ఈ వాగు దాటలేను'' అన్నాడు.

''లోతుకూడా ఎక్కువే'' అంది.

''మరెలా. వెనక్కు వెళ్లడం మంచిదేమో''

''ఇంత దూరం వచ్చి వెనక్కు వెళ్తారా. నేనున్నానుగా...'' అంది అంటూ నీళ్లలోకి దిగింది.

''నా చేతులు పట్టుకోండి'' అంది.

రాజు చేతులు అందించాడు.

ఆ స్పర్శ వేడిగా వుండక చల్లగా వుంది. అసలే చలినీళ్లు. చల్లగా ఆ అమ్మాయి చేతుల స్పర్శ. వణికిపోతున్నాడు. నీళ్లలోకి లాగింది. రాజు ఒళ్లు వశం తప్పుతోంది. నేల ఆనిందో లేదో తెలీటంలేదు. ఆమె కౌగిలిలో వుండిపోయాడు. లాక్కు వెళ్తోంది. ప్రవాహవేగంతో కొట్టుకుపోతున్నాడు. అతని మొహంమీద ఆమె మొహం. ఆమె కురులు అతని మొహాన్ని కప్పేశాయ్. కురులు మంచులా చల్లగా వున్నాయ్. మంచుగడ్డ బిగికౌగిలిలో వున్నట్లు భావన కలుగుతోంది.

అప్రయత్నంగా ''సుజనా సుజనా'' అంటున్నాడు.

''నేనే సుజనను, నేనే రజనిని'' అంటూ పెద్దగా నవ్వు వినిపించింది. ఐదు నిమిషాల హోరు. ఒడ్డున పడి వున్నాడు.

''సుజనను అడిగానని చెప్పండి'' అంటూ వడివడిగా వెళ్లిపోయింది రజని.

నిలబడ్డాడు విశ్వప్రయత్నంమీద. నీరసంగా వుంది. ఇల్లు చేరాడు. తలుపు తీసిన సుజన ఆశ్చర్యంగా చూసింది. హఠాత్తుగా భర్తనుచూసి ఆనందంగా లోపలకు దారితీసి

ంది.

''ఇంత వర్షంలో ఎలా వచ్చారు. దారి ఎలా తెలిసింది. వాగులో నీళ్లుండాలికదా'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

''నీ స్నేహితురాలు రజని దారిచూపించింది. తోడుగా వచ్చింది'' అన్నాడు తువ్వాలుతో తల తుడుచుకుంటూ.

''రజనా'' అంటూ కొయ్యబారిపోయింది సుజన.

బతికి బయట పడ్డారంటూ రాజును హత్తుకుపోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

''ఏమిటే, ఎందుకూ'' అంటూ రాజు కంగారుపడ్డాడు.

''రజని చచ్చిపోయి ఐదేళ్లయిందండీ'' అంది.

బిక్కచచ్చిన రాజు సుజన వేడి కౌగిలిలో కాని తేరుకోలేదు.

○ ● ○



చిత్రం : [illegible] (మద్రాసు)